# సంపాదకీయం

విజ్ఞాన భారతి ఆరవ సంచికకు స్వాగతం.

గత జూన్ నెలలో 22వ తేదీన హైదరాబాద్ త్యాగరాజు గాన సభలో విజ్ఞాన భారతి మొదటి సమావేశం జరిగింది. రచయితలు శ్రీయుతులు అంగర గోపాలకృష్ణ గారు శ్రీమతి చాగంటి కృష్ణ కుమారి గారు, ఇంకా మిత్రులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. ప్రసంగాల రూపంలో కొంత చర్చా రూపంలో కొంతగాను సాగింది ఈ కార్యక్రమం. తెలుగులో వైజ్ఞానిక సాహిత్యం వెలువరించాలనే దిశలో సాగుతున్న ఈ ఉద్యమం గురించి రచయితలూ, కొందరు ప్రేక్షకులు సైతం తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఒకరు మాత్రం ఇటువంటి ప్రయత్నం ఈ కాలంలో ఇంకా అవసరమా అనే ప్రాథమిక అభ్యంతరం కూడా లేవదీశారు. ఈ అభ్యంతరం కొత్తేమీ కాదు. అయితే మనకు తెలిసిందే కదా కొండ దాటితేనే కానీ మైదానం రాదు.

ఈ సందర్భంగా బాలారిష్టం రూపంలో ఒక సమస్య కూడా ఎదురయ్యింది. అది పేరుకు సంబంధించినది. విజ్ఞాన భారతి అనే సంస్థ ఒకటి భారతదేశంలో ఇదివరకే ఉన్నదనీ, అందుచేత ఈ పేరు వల్ల జనత పొరబడే అవకాశం ఉన్నదనీ, ఆ సంస్థ తాలూకు ప్రతినిధి ఒకరు వాట్సాపు ద్వారా నాకు తెలియజేశారు. అందుచేత ఆపద్ధర్మంగా ఆ సమావేశంలో వేదిక వెనక ప్రదర్శించిన ప్లెక్సీలో అమెరికా విజ్ఞాన భారతి అని రాయించాం.

ఈ విషయం సమావేశంలో ప్రస్తావనకు తెచ్చినప్పుడు రెండు ప్రత్యామ్నాయ పదాలను సూచించారు అంగర వారు విజ్ఞాన జ్యోతి అని, చాగంటి కృష్ణ కుమారి గారు విశ్వవిజ్ఞానభారతి అని సూచించారు. తరువాత గాడేపల్లి సుబ్రహ్మణ్యం గారు విజ్ఞాన భారతీయం అని, కొచ్చెర్లకోట బాపారావు గారు విజ్ఞాన తరంగిణి అని సూచించారు. మరికొన్ని నాకు తట్టిన పేర్లు: విజ్ఞాన వాహిని, విజ్ఞాన స్రవంతి. ఈ విషయమై ఏదో ఒక నిర్ణయం చేయవలసిన అవసరం ఉన్నది. మీ సూచనలను ఈమెయిల్ ద్వారా తెలియజేయవలసిందిగా పాఠకులను కూడా కోరుతున్నాము.

ఇక పోతే, శ్రీమతి చాగంటి కృష్ణ కుమారి గారు పత్రికను సాధారణ స్థాయి నుంచి పరిశోధనా స్థాయికి పెంచాలని అభిప్రాయపడ్డారు. అది తప్పక స్వీకరణీయమే అయితే విజ్ఞాన భారతి ఇంకా తొలి అడుగుల దశలోనే ఉన్నందున ఆ స్థాయిని చేరుకోవడానికి కొంత వ్యవధి పడుతుంది.

***

తెలుగులో నాలుగేళ్ళ ఇంజినీరింగు కోర్సు ఎలా ఉండబోతోంది, దాని రూపురేఖల విశ్లేషణ ప్రణాళికలపై పని సాగుతోంది. దానిలో అంతర్భాగంగా ఇంజనీరింగు పరిభాష దాని ఆధారంగా పాఠ్య గ్రంథాల తయారీ, ప్రచురణ వంటి విషయాలపై ఆలోచనలు సాగుతున్నాయి రాబోయే సంవత్సరంలో ఇది రూపు సంతరించుకొని ప్రజా బాహుళ్యంలోకి రాగలవని ఆశిస్తున్నాం.

***